# స్వతంత్ర భారత్ - జిందాబాద్

బలగమంతా ఒక ఎత్తైతే భార్య సోదరుడు మరో ఎత్తని ఊరకే అన్నారా !

మాక్కావాల్సిన వాళ్లంతా నా బామ్మర్ది బాలయ్యనూ - నన్ను కృష్ణార్జునులతో పోల్చేస్తారు. ఇద్దరమూ గుమస్తాలమే. కాపోతే... కామర్సు డిగ్రీ క్లాసుతో పాసైన నేను బాంకులో చేరితే, ఇంటర్‌తో తంటాలు పడలేక వాడు బట్టల కొట్టులో చేరాడు. అర్జునుని పాత్రకు న్యాయం చేయ్యాలి కాబట్టి నాముందు భయభక్తుల ప్రదర్శింస్తుంటాడు.

భార్యకు టాటా చెబుతూ బాంకుకు బయలుదేరబోతున్నాను. ఉరుములేని పిడుగులా ఊడిపడ్డాడు బాలయ్య. వాళ్లక్కకు అభిముఖంగా పరుగెత్తుకొస్తూ

"అక్కా ! బావతో పనుందే !" అన్నాడు. అస్తమారోగిలా దమ్మువీస్తూ.

"మీరు కాస్తాగండీ !"

ఆవిడ అస్త్రసంధానముతో స్కూటర్ ఆఫ్ చేసి ఇంట్లోకి నడిచాను. బాలయ్య వాళ్లక్క వెంటే వస్తూ "పోలీస్ స్టేషన్నుండి వస్తున్నా బావా !" అన్నాడు.

"ఏం నేరం చేశావురా వెధవా !" ముద్దబంతి పూవులాగున్న నా భార్య మోము వాడిపోయిన వంకాయలాగైంది.

"అసలేమైందంటే బావా...!" నాకెదురుగా వాళ్లక్క పక్కన కూచున్నాడు.

"ఉపోద్ఘాతం బంగాళాఖాతం చెయొద్దు !" హెచ్చరించాను. వాడు చెప్పిన సారాంశమేమిటంటే -

మూడ్రోజుల క్రితం వాళ్ల బట్టలకొట్టు సేటుగారి కొత్త సైకిల్ తీసుకుని లంచవర్లో ఇంటికి బయలుదేరాడు. తగుదునమ్మా అంటూ మధ్యలో సూపర్‌బజార్ సూపర్‌గా కనబడింది. సరదాగా సబ్బులు కొనాలన్పించింది. సైకిల్‌కు తాళమేసి లోపలికెళ్లాడు. రెండు నిమిషాల్లో రెండు సబ్బులు కొనుక్కుని హుషారుగా బయటకొచ్చాడు. సైకిల్ కన్పించలేదు. అదే సైకిల్ మీద ఎవరో ఎక్కి పోవడం కన్పించింది. గావుకేకలు పెట్టాడు. 'దొంగ... సైకిల్ దొంగ' అంటూ ఫర్లాంగుదూరం పరుగెత్తాడు. కేకలకు స్పందించిన నలుగురు కలిసి సైకిల్ దొంగను పట్టుకున్నారు.

కాస్సేపు దేహశుద్ధి కార్యక్రమం జరిగింది. వాడు దొంగనని ఒప్పుకున్నాడు. మరో నాలుగు చప్పరించాక భారతీయ పౌరుల బాధ్యత గుర్తుకొచ్చింది. దొంగగారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. యస్సై లేడు, హెడ్ కానిస్టేబుల్ దొంగను మెడబట్టి లాకప్‌లోకి తోసేసి "దొంగిలించిన సైకిల్‌ను గూడా ఉంచి వెళ్లండి. రేపు యస్సైగారొచ్చాక తీసుకెళ్ళొచ్చు" అన్నాడు.

సరేనని... అలాగే చేస్తామని కొత్త సైకిల్ అక్కడుంచి వచ్చాడు. మర్నాడు మావాడు మూడు సార్లు పోలీస్‌స్టేషన్ కెళ్ళాడు. హెడ్‌కానిస్టేబుల్ కోర్టు డ్యూటీకెళ్లాడన్నారు. మిగతా

వారెవ్వరూ వీణ్ని పట్టించుకోలేదు. మూడోరోజు హెడ్డు, యస్సై ఇద్దరూ ఉన్నారు. మావాడి గోడువిని - కేసు బుక్కౌతుంది. సైకిల్ కోర్టు నుండే తీసుకోవాలన్నాడు యస్సై. ఎంత బతిమాలినా వినలేదు. అంతా చెప్పి -

"మాసేటు నాతాట వొలిచేస్తున్నాడు. ఇంక నువ్వే దిక్కు బావా!" అని - దగ్గరి బంధువు టపాకట్టేసినట్టు బోరు మన్నాడు.

నా భార్య ఆదిలక్ష్మిలా పోజిచ్చి

"మీరు వెంటనే రంగంలోకి దిగాలండీ !" అంది.

నాకావేశమొచ్చింది. బంధుప్రీతి బుసలు కొట్టింది. ఉన్నపళంగా బామ్మర్దితో సహా బయల్దేరాను. పోలీస్‌స్టేషన్ పుల్లూరుబండ జాతరలాగుంది. ఓవైపు లాకప్ వాయింపులు, మరోవైపు ఖాకీలతో ఖాదీల సంప్రదింపులు, గుసగుసలూ, రుసరుసలూ.

నా పరిస్థితి - అంగట్లో అమ్మా అంటే ఎవడికి పుట్టావు బిడ్డా ? అన్నట్టుగైంది. గుండె లబ్‌డబ్ మంటూంది. ఆవేశమంతా ఆరిపోయింది. గంట సేపు వెయిట్ చేసినా యస్సై దర్శనం లభించలేదు.

బాంక్ టైమైపోయింది. జేబులున్న స్ట్రాంగ్ రూం తాళాలు తకదిమ్మంటున్నాయి. ఆహా ! యస్సై బయటి కొస్తున్నాడు. అతని వెంట నలుగురైదుగురు ప్రజా నాయకులున్నారు.

"నమస్తే సార్ !" చేతులు జోడించాను. నావైపు కన్నెత్తైనా చూడకుండా టకటకా వెళ్లి ప్రజానాయకులతో సహా జీపెక్కి నిష్క్రమించాడు.

ఇలా ఆషామాషీగా వస్తే కుదరదని మర్నాడు సెలవు బెట్టి స్టేషన్లో బైఠాయించాను. సూర్యుడు నడినెత్తి మీదికొచ్చాడు. యస్సై స్టేషన్‌కు రాలేదు. జుట్టు పీక్కోవాలన్పించింది.

"అదిగో... నా సైకిలక్కడుంది బావా !" వేలెత్తి అటువైపు చూపించాడు బాలయ్య. వాడి పీక నులిమి పేకాడాలన్నంత కోపమొచ్చింది.

"ఉంటే ఉందిలే నా పిండాకూడు, ఉన్నచోట ఉండక నాకో లంపటం తగిలించావ్, ఈ పోలీస్‌స్టేషన్లో వెయిట్ చేసేకంటే పోలేరమ్మ గుడి చుట్టూ పొర్లదండాలు తియ్యడం నయం" గుడగుడ లాడి గుడ్లెర్ర జేశాను.

మధ్యాహ్నం రెండైంది. కడుపులో ఎలుకలు పరుగెడుతున్నై. ఎందుకైనా మంచిదని ఓ కానిస్టేబుల్ నడిగాను యస్సై జాడగురించి. అతడు నన్నో విలన్‌లా చూసి "యస్సైగారు క్రైం మీటింగ్‌కు యస్పీ ఆఫీసుకెళ్లారు. రేపు రావచ్చు." చావు కబురు చల్లగా చెప్పేశాడు. ఒంటిమీది గుడ్డలు బరబరా చించేసుకోవాలన్పించింది. రైటరు దగ్గరికెళ్లాను. అతడప్పుడప్పుడు బాంకుకొస్తుంటాడు.

"ఇంతకీ మా బామ్మర్ది కేసు రిజిష్టరైందాండీ?" అడిగాను. అరమోడ్పు కళ్లతో అలవోకగా దృష్టి సారించి "ఆ సంగతి యస్సై గారినే అడగాలండీ !" సన్నుమన్నాడు.

యస్సై స్టేషన్లో ఉన్నప్పుడు నాకు వెళ్లడం కుదరదు. నేను వెళ్లినప్పుడతడుండడు. బాంకులో మానేజర్‌కూ, ఇంట్లో ఇల్లాలికి సంజాయిషీలు చెప్పలేక ఛస్తున్నాను. వారం గడిచిందలాగే.

శుక్రవారం పూజాగదిలోంచి బయటకు రాగానే బామ్మర్ది దర్శనమైందు. వాళ్లక్కతో గోడు వెళ్లబోసుకుంటున్నాడు.

"ఇది విన్నారా !" భార్య భద్రకాళైంది. "ఆ సైకిల్ తెచ్చేదాకా మా తమ్ముణ్ణి డ్యూటీకి రావద్దని పంపించారట. ఇహ ఏం చేస్తారో ఏమో... అసలూ..." ఏదో పురాణం విప్పబోయింది.

"మీ తమ్ముడు మంత్రిగారి బామ్మర్దా లేక కలెక్టర్ కొడుకా !" నాకు ఒంటిమీద పోలీస్ దెబ్బ పడ్డట్టనిపించింది. "నిక్షేపంలా దొరికిన సైకిల్‌ను పోలీసులకెందుకిచ్చాట్టా ?" నిగ్గదీశాను.

"బుద్ధి గడ్డితిని సేటుగారి సైకిల్ తెచ్చాడు. పిచ్చోడై పోలీస్‌స్టేషన్ కిచ్చాడు. అరెరే... అర్భకుడు గదా... రోజుకు మూడుసార్లు కుక్కలా పోలీస్‌స్టేషన్ కెళ్లొస్తున్నాడు గదా ! వాడంటే పాపమనే వారేలేరు. మానాన్నే బతికుంటే వాడి పరిస్థితి ఇలాగుండేదా ? ఏదో... బావనే దిక్కని నమ్ముకున్నాడు. వెదవ..." కలకంఠి కంట కన్నీరొలికింది.

నా కోపం పౌరుషంగా మారింది.

ఏకంగా మూడ్రోజుల సెలవు పెట్టేశాను. కుండపోత వర్షాన్ని కూడా లెక్క చెయ్యకుండా రయ్‌మని రక్షకభట నిలయానికెళ్లాం.

ఆహా ఏమి మా అదృష్టం ! యస్సై... సాక్షాత్తు యస్సైగారు చాంబర్లో చాయదాగుతూ ఒంటరిగా కన్పించారు. నమస్కార బాణం పడేసి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. టీవీ అనౌన్సర్లా నవ్వేశాడు యస్సై. నాకు కుర్చీ చూపిస్తూ -

"ఇతనెవరూ ?" అడిగాడు - బాలయ్య వైపు చూపిస్తూ.

చెప్పాను. కేసంతా చెప్పేశాను. చివరికి "దొంగను మావాడే రెడ్ హాండెడ్‌గా పట్టుకుని మీకప్పగించాడు, దయచేసి సైకిల్ ఇప్పిస్తే వాడి ఉద్యోగం ఊడకుండా ఉంటుంది సార్ !" బతిమాలాను.

నా పక్కనే చేతులు కట్టుకునుంచున్నాడు బాలయ్య.

"అలా కుదరదు." యస్సై గొంతు ఖంగుమంది. "నిన్న రాత్రి ఇతని కొత్త సైకిల్‌ను దొంగ లెత్తుకెల్తుంటే మా బీటు కానిస్టేబుళ్లు వెంబడించి పట్టుకున్నారు. ఆ సైకిల్‌ను ఈయనిప్పుడు క్లెయిం చేస్తున్నాడు."

నాకు ముచ్చెమటలు పోశాయి. బాలయ్య బిగుసుకు పోతున్నాడు. నేనూరుకుంటానా!... ఆహా !

"కాద్సార్... వారం క్రితమే..." రెచ్చిపోబోయాను.

"అదంతా మరిచిపోవాలి. సైకిల్ వివరాలతో మీరిప్పుడు అప్లికేషన్ రాసివ్వండి. ఈ రోజు శుక్రవారం, రేపు సెకండ్ సాటర్‌డే. కోర్టు సెలవు. సోమవారం నాడు కోర్టులో తీసుకోవచ్చు."

వర్షం వెలిసింది. నాకు అరికాలు మంట నెత్తికెక్కింది. అతన్నమాంతం మింగెయ్యాలన్పించింది.

"ఇది మరీ అన్యాయం సార్ ! మావాడి సైకిల్..."

"అదేమన్నా మారుతీకారా ? అలా మాట్లాడ్తే కుదరదు. మినిష్టర్ ప్రోగ్రాముంది. బందోబస్తు కెళ్లాలి." రైటర్‌కేదో చెప్పేసి గబగబా వెళ్లిపోయాడు. ఏడుపొచ్చినంత పనైంది. అలాగే రాసివ్వక తప్పలేదు.

సోమవారం మళ్లీ స్టేషనుకెళ్లాం.

"కేసు ఈ రోజు మధ్యాహ్నం కోర్టుకెల్తుంది. రేపు నేరుగా కోర్టుకొచ్చి సైకిలక్కడే తీసుకోవచ్చు. ఇదో... కేసు నేనే రాస్తున్నాను. ఏదో... రెండువేల రూపాయల సైకిల్‌గదా..." ఆశగా చెయ్యి చాచాడు. కోపాన్నంతా విషం మింగిన గరళ కంఠుడిలా గొంతులోనే అణిచిపెట్టి ఇరవైనోటు రైటరు చేతులుంచాను.

మంగళవారం కోర్టులో బాలయ్యనెన్నో ప్రశ్నలడిగారు. మావాడు తడుముకోకుండా జవాబులిచ్చాడు.

"రేపిదే సైకిల్ మాదని మరెవరన్నా క్లెయిం చెయ్యొచ్చు. రెండువేల రూపాయల పూచీకత్తు ఇచ్చి సైకిల్ తీసుకెళ్లొచ్చు." కోర్టు నిర్ణయం.

మోటకేసిన మొద్దులా - నేనే పూచీకత్తునైనాను.

అంతా అయాక "ఇహ సైకిలిప్పించండి సార్ !" అడిగాను కోర్టు గుమస్తాను - అతి మర్యాదగా.

"ఇలా కాయితాలు పడేసి అలా వస్తువు పట్టుకెళ్లడాని కిదేమన్నా వ్యాపారమా ? గవర్నమెంటాఫీసుల్లో పనులు చేయించుకునే ఇంగిత జ్ఞానముండొద్దా ?" అగ్గిమీద గుగ్గిలమైపోయాడు.

నా పర్సులోని యాభై అతని జేబులోకెళ్లాక -

"ఇప్పుడు స్టోర్ కీపర్ లేడు. రేపొచ్చి తీసుకెళ్లండి సార్ !" అన్నాడు విప్పారిన మొహంతో.

మరోరోజు సెలవు పొడిగించి మర్నాడు కోర్టు ఆఫీసు కెళ్లాం. ఈరోజీపని పూర్తి చేసుకోవాల్సిందే.

"హల్లో సార్ !" అంటూ కరచాలనం చేస్తూ స్టోర్ కీపర్ చేతికి యాభై నోటందించాను. సైకిల్ వివరాలడిగి "అదిగో... అందులో ఉంది తీసుకెళ్లండి" అన్నాడు. వరుసగా నిలబెట్టిన సైకిళ్లను చూపిస్తూ.

మావాడి మొహమొక్షణం మరకతంలా వెలిగింది. సైకిళ్లన్నీ చూచాక మొగ్గలా ముడుచుకు పోయింది.

"నా సైకిలందులో లేద్సార్ !" చిన్నబోయాడు.

స్టోర్ కీపర్ లేచొచ్చి "ఎర్రసీటు కవరుగదా ! అదిగో... ఫ్రేం నెంబర్ చూడండి. అదే మీ సైకిల్" అంటూ ఓ పాత సైకిల్ చూపించాడు. రెక్కలూడిన పక్షిలాగుందది. ఫ్రేమ్ నెంబర్ చూశాక బాలయ్య నోరు బార్లా తెరుచుకుంది.

"సీటు కవరూ, ఫ్రేము మాత్రమే మావి. మిగతా పార్టులన్నీ మారిపోయినై బావా : బంగారం లాంటి కొత్త సైకిల్... అయ్యో... అయ్యయ్యో..." లబలబ లాడుతున్నాడు.

స్వర్ణ భారతి జిందాబాద్.

స్వతంత్ర భారత్ జిందాబాద్.

గొంతెత్తి గట్టిగా అరవాలన్పించింది.

**ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక, జూలై 1998**